## విశ్రాంత ఉద్యోగులను ఆదుకోవాలి

కరీంనగర్ కలెక్టరేట్, జూన్ 16 : విశ్రాంత ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు స్వామి డిమాండ్ చేశారు. ఆదివారం నగరంలోని మంకమ్మతోటలో గల ఆ సంఘం జిల్లా కార్యాలయంలో నిర్వహించిన ఉమ్మడి జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను విస్మరించి పాలన సాగిస్తోందని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఈసీ అనుమతించినా తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ విడుదల చేసిన డీఏను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం విడుదల చేయలేదని ఆరోపించారు. న్యాయంగా దక్కాల్సిన సౌకర్యాలు కూడా వర్తింపజేయకుండా, ''మీరే చూస్తున్నారుగా'' అంటూ నోటితో మాట్లాడుతూ నొసటితో వెక్కిరిస్తున్నారని మండిపడ్డారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో తాము అందజేసే వినతులు సంబంధిత శాఖలకు వెళ్లేవని, వెంటనే స్పందించి ఉన్నతాధికారులు కూడా సమావేశాలు ఏర్పాటు చేసి, సమస్య పరిష్కారంపై దృష్టి సారించేవారని గుర్తుచేశారు. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ పరిస్థితులు లేవని ఆగ్రహించారు. వెంటనే విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ప్రతినిధులు రామ్మోహన్ శర్మ, ఇమ్మడి వెంకటేశ్వర్లు, జక్కని మోహన్, రాజయ్య, వొద్దమల్ల మనోహర్, శకుంతలాదేవి, రాజనర్సింగరావు, పాల్గొన్నారు.

# రైతుల మెడపై క(త్తి)ల్తీ

## నకిలీ పత్తి విత్తనాలపై కొరవడిన నిఘా



- ఆంధ్రా నుంచి యథేచ్ఛగా రవాణా
- గత ప్రభుత్వంలో పీడీ యాక్ట్ ప్రయోగం
- నేడు పట్టించుకోని రాష్ట్ర సర్కారు

**వానకాలం సీజన్ ప్రారంభం కావడంతో నకిలీ విత్తన కేటుగాళ్లు గ్రామాల్లో తిష్ట వేస్తున్నారు. లేని పోని విషయాలు చెప్పి రైతులకు నకిలీ విత్తనాలు అంటగడుతున్నారు. రైతులకు సరిపడా విత్తనాలు అందుబాటులో ఉంచుతున్నామని అధికారులు చెబుతున్నా విత్తనాలు లభించక రైతులు నకిలీ విత్తన మాయగాళ్ల ఉచ్చులో పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో కల్తీ విత్తనాలు విక్రయించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా పీడీ యాక్ట్ నమోదు చేసి కటకటాల్లోకి పంపించారు. ప్రస్తుతం పరిస్థితి తారుమారవడంతో కొందరు వ్యాపారుల నకిలీ విత్తన వ్యాపారం యథేచ్ఛగా సాగుతోంది. ఆంధ్రా ప్రాంతం నుంచి రవాణా చేస్తూ విచ్చల విడిగా విక్రయిస్తున్నారు..**

– కరీంనగర్, జూన్ 16 (నమస్తే తెలంగాణ)/రాంనగర్

### ఆంధ్రా నుంచే అక్రమ దందా

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కొందరు నకిలీ విత్తన వ్యాపారులకు అడ్డాగా మారింది. ఈ రాష్ట్రంలోని పలు జిల్లాల నుంచి నకిలీ విత్తనాలు పెద్ద మొత్తంలో తెలంగాణ జిల్లాలకు చేరుతున్నట్లు అనేకసార్లు రుజువైంది. గత ప్రభుత్వ హయాంలో నిషేధిత హెట్‌టీ పత్తి విత్తనాల దందాకు ఆంధ్రా ప్రాంతానికి చెందిన కొందరు కేటుగాళ్లు పక్కా ప్రణాళికతో తెరతీశారు. అయితే, అప్పుడున్న కేసీఆర్ ప్రభుత్వం ఈ కేటుగాళ్ల ఆటలు సాగనివ్వలేదు. ఎక్కడ చిన్న మొత్తంలో నకిలీ విత్తనాలు లభించినా అక్రమార్కులపై క్రిమినల్ కేసులు బనాయించి జైళ్లకు పంపింది. దీంతో 2018 నుంచి 2020 వరకు ఈ దందాను దాదాపుగా అరికట్టింది. ఈ మూడు నాలుగేళ్లలో నకిలీ విత్తన వ్యాపారులు తెలంగాణ ప్రాంతానికి రావాలంటేనే హడలి పోయారు. ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో అక్రమార్కులు మరోసారి చెలరేగుతున్నారు. సీజన్ ప్రారంభం కాకముందే జిల్లాలకు పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలు డంపు చేసుకున్నట్లు తెలుస్తోంది. ఆంధ్రా వ్యాపారుల కనుసన్నల్లో ఇక్కడి వారు కూడా ఈ దందాకు పాల్పడుతున్నట్లు తెలుస్తోంది. మునుపటి మాదిరిగానే హెచ్‌టీ విత్తనాల పేరుతో గ్రామాల్లో దందా సాగుతున్నట్లు తెలుస్తోంది. బీటీ–3 ఫార్ములాతో రూపొందించిన ఈ విత్తనాలు గడ్డి మందును తట్టుకుంటుందని అక్రమ వ్యాపారులు రైతులను నమ్మిస్తున్నారు. పత్తిలో గడ్డి మందు వాడితే జరిగే నష్టాలు అనేకం ఉన్నాయని ఈ విత్తనాలను గతంలోనే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిషేధించాయి. అయినా, కొందరు వ్యాపారులు ఈ విత్తనాలను గుట్టుగా గ్రామాలకు తరలించి రైతులకు విక్రయిస్తున్నారు. వీటి ముసుగులో నకిలీ విత్తనాలను కూడా అమ్ముతున్నారని తెలుస్తోంది.

### యథేచ్ఛగా నకిలీ దందా

రైతులు సాగు చేసుకునే సమయం ముంచుకొస్తున్నా వారికి అవసరమైన విత్తనాలను ప్రభుత్వం అందుబాటులో ఉంచకపోవడం సమస్యగా మారింది. యాసంగిలో పంటల దిగుబడి సరిగా లేక.. పెట్టుబడి సాయం అందకపోవడం.. సీజన్ ప్రారంభం కావడంతో రైతులు విత్తనాలు కొనుగోలుకు తంటాలు పడుతున్నారు. అయితే, డిమాండ్‌కు తగినన్ని విత్తనాలు మార్కెట్‌లో అందుబాటులో లేక పోవడంతో దళారులు కల్తీ విత్తనాల విక్రయానికి తెరలేపినట్లు తెలుస్తోంది. బీటీ విత్తనాలు అని నమ్మించి క్వింటాళ్ల కొద్దీ నకిలీ పత్తి విత్తనాలు తీసుకొచ్చి అంటగడుతున్నారని తెలుస్తోంది. వర్షాలు అనుకూలిస్తే ఇప్పటికే చాలా మంది రైతులు పత్తిని విత్తుకునేవారు. నీటి సదుపాయం ఉన్న రైతులు ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో పత్తి విత్తుకుంటున్నారు. అయితే, నకిలీ విత్తనాలు కొనుగోలు చేసిన కొందరు రైతులు మోసపోతున్నారు. నకిలీ విత్తనాలు కొనుగోలు చేయవద్దని వ్యవసాయ అధికారులు గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కానీ, నకిలీ విత్తనాలు అమ్మే కేటుగాళ్ల మాయమాటలతో రైతులకు నకిలీ పత్తి విత్తనాలు అంటగడుతున్నారు.

### కరువైన నిఘా

నకిలీ విత్తనాలపై నిఘా కరువవడంతో దళారుల నుంచి బెడద ఎక్కువైంది. గతంలో వేసవికాలం ముగుస్తున్న సమయంలోనే విత్తనాలను అందుబాటులో ఉంచడమే కాకుండా కల్తీ విత్తన విక్రయాలపై కఠిన వైఖరి ప్రదర్శించేవారు. విస్తృతమైన తనిఖీలు నిర్వహించే వారు. కల్తీ విత్తనాలు ఉంటే కేసులు నమోదు చేసి పీడీ యాక్ట్ నమోదు చేసి జైలుకు పంపించారు. గతంలో రామడుగు, తిమ్మాపూర్, హుజూరాబాద్‌తోపాటు కరీంనగర్ కేంద్రంగానూ ఈ దందా పెద్ద మొత్తంలో నడిచేది. గత ప్రభుత్వం కఠినంగా వ్యవహరించి అక్రమార్కులపై ఉక్కుపాదం మోపడంతో 2020 నుంచి అక్కడక్కడ మినహా ఈ దందా చేసేందుకు ఎవరూ సాహసించ లేదు. ప్రభుత్వం మారడంతో పరిస్థితులు మారిపోయాయి. విత్తనాలను అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయ శాఖ అధికారులు దుకాణాల్లో ఎప్పటికప్పుడు తనిఖీలు చేసి సరైనవి అమ్ముతున్నారా? లేదా?, రికార్డులు సరిగా ఉన్నాయా? లేదా? అనేవి నిశితంగా పరిశీలించాలి. అయితే, వారు నామమాత్రంగా తనిఖీలు చేసి చేతులు దులుపుకుంటున్నారన్న విమర్శలు వస్తున్నాయి. ఇక కల్తీ విత్తనాలు సరఫరా చేసే వ్యాపారులు పట్టుబడినట్టు కేసులు నమోదు చేశామని ప్రకటిస్తున్న పోలీసులు ఎలాంటి కేసులూ లేకుండానే వాళ్లను వదిలిపెట్టడంతో నకిలీ పత్తి విత్తనాల విక్రయాలు మరింత ఎక్కువయ్యాయి. దీనికి వారం రోజుల క్రితం కరీంనగర్, రామగుండం పోలీసు కమిషనరేట్ల పరిధిలో మూడు రోజుల వ్యవధిలోనే రెండు సార్లు పట్టుబడిన నాగేశ్వర్ రావు ఉదంతమే ప్రత్యక్ష ఉదాహరణగా చెప్పుకోవచ్చు.



ఈనెల 6వ తేదీ : నకిలీ పత్తి విత్తనాలతో పట్టుబడ్డ వ్యాపారి చందు నాగేశ్వర్‌రావును అదుపులోకి తీసుకుని చూపెడుతున్న కరీంనగర్ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు



ఈ నెల 9న : ఇదే నాగేశ్వర్‌రావును నకిలీ పత్తి విత్తనాలతో సహా అదుపులోకి తీసుకుని చూపెడుతున్న రామగుండం కమిషనరేట్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు

ఈ నెల 6న మంచిర్యాల జిల్లా భీమారంలో నివాసముంటున్న చందు నాగేశ్వరరావు అనే వ్యక్తి గుంటూరు జిల్లా పత్తిపాడు నుంచి 60 కేజీల నకిలీ పత్తి విత్తనాలు రవాణా చేస్తుండగా కరీంనగర్ కమిషనరేట్ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు పట్టుకున్నారు. అతడిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్లు మీడియాకు వివరాలు వెల్లడించారు. ఇదే వ్యక్తిని తిరిగి రామగుండం కమిషనరేట్ పోలీసులు మంచిర్యాల జిల్లా భీమారం పరిధిలో మూడు రోజుల వ్యవధిలోనే పట్టుకున్నారు. ఈ నెల 6న మొదటిసారి పట్టుబడిన నాగేశ్వర్‌రావు వద్ద గుంటూరు నుంచి తెస్తున్న క్వింటాల్ నకిలీ పత్తి విత్తనాలు లభించాయి. అలాగే, ఈ నెల 9న రెండోసారి పట్టుబడినపుడు కర్నూల్ జిల్లా నుంచి తెస్తున్న పత్తి విత్తనాలతో పట్టుబడ్డాడు. మూడు రోజుల వ్యవధిలోనే రెండు సార్లు పట్టుబడిన నాగేశ్వర్‌రావును మొదటిసారి పట్టుకుని కఠినంగా శిక్షించినట్లయితే రెండోసారి పట్టుబడే వాడు కాదనే వాదనలు వినిపిస్తున్నాయి. నకిలీ విత్తనాలను అరికట్టేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ బృందాలు ఎంత సమర్థవంతంగా పనిచేస్తున్నాయో ఈ ఉదంతమే నిదర్శనం. గత ప్రభుత్వ హయాంలో నకిలీ విత్తనాల వ్యాపారం చేయాలంటేనే హడలి పోయిన కేటుగాళ్లు ఇపుడు యథేచ్ఛగా తమ వ్యాపారాలు సాగిస్తున్నారని చెప్పడానికి ఇదొక ఉదాహరణగా చెప్పవచ్చు..

### విత్తన చట్టాలు ఏం చెబుతున్నాయి?

నకిలీ విత్తనాలను అరికట్టేందుకు అనేక చట్టాలు ఉన్నాయి. వాటిని వినియోగించి అధికారులు కట్టడి చేసే అవకాశాలు ఉన్నాయి.

- నకిలీ విత్తనాల విక్రయించే వారిపై విత్తన నియంత్రణ ఉత్తర్వులు, 1983 (3), పత్తి విత్తన చట్టం 5(1) నిబంధనల విత్తన చట్టం 2007 క్లాజు 7, అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్ 7, విత్తన చట్టం 2007 సెక్షన్ 12 ప్రకారం జరిమానా విధించవచ్చు.
- విత్తన డీలర్లు లైసెన్స్‌లు తప్పనిసరిగా తమ దుకాణాల్లో ప్రదర్శించాలి. ఈ నిబంధనలు అతిక్రమిస్తే ఉత్తర్వుల సంఖ్య 1993 (15) ప్రకారం డీలర్ లైసెన్స్‌ను రద్దు చేయవచ్చు.
- ధరల పట్టిక, స్టాక్ బోర్డును విధిగా ఏర్పాటు చేయాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే అమ్మకాలు నిలిపివేసి ఉత్తర్వుల సంఖ్య 1993 (15) ప్రకారం డీలర్ లైసెన్స్ రద్దు చేయవచ్చు..
- అమ్మకం రసీదు విధిగా ఇవ్వాలి. రైతులు కూడా తప్పనిసరిగా అడిగి తీసుకోవాలి. ఈ నిబంధన పాటించని డీలర్‌కు విత్తన నియంత్రణ ఉత్తర్వుల సంఖ్య 1993 (9), విత్తన నిబందనలు 2007 (21) ప్రకారం నోటీసు జారీ చేస్తారు. తప్పును సరిచేసుకోనట్లయితే లైసెన్స్ రద్దు చేస్తారు.
- లేబుల్ లేని ప్యాకెట్లు విక్రయించే వారు ఎవరైనా శిక్షార్హులే. విత్తన ప్యాకెట్ కంపెనీ లేబుల్ ఉన్నదా? లేదా? అనేది రైతు చూసుకోవాలి. లేబుల్ పూర్తిగా లేక పోయినా, సక్రమంగా లేక పోయినా విత్తన చట్టం 1966(7), విత్తన నియత్రణ ఉత్తర్వులు 1983 (8), నిబంధనలు 2007 సెక్షన్ 3,4,5,6 ప్రకారం ఆ విత్తనాలు జప్తు చేస్తారు. డీలర్లు అయితే వారి లైసెన్స్ రద్దు చేస్తారు. అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్ 7, విత్తన చట్టం 2007 సెక్షన్ 12 ప్రకారం జరిమానా విధిస్తారు.
- కాలం చెల్లిన విత్తనాలు అంటగడితే విత్తన చట్టం 1966 సెక్షన్ 7, విత్తన నియంత్రణ ఉత్తర్వులు 1983 (8) (అ), పత్తి విత్తన నిబంధనలు 2007 సెక్షన్ 4,5 ప్రకారం విత్తనాలు జప్తు చేస్తారు. డీలర్ అయితే వారి లైసెన్స్ రద్దు చేసి అత్యవసర సరుకుల చట్టం 1955 సెక్షన్ 7 పత్తి విత్తన చట్టం 2007 సెక్షన్ 12 ప్రకారం జరిమానా విధిస్తారు.
- ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే పత్తి విత్తనాలు విక్రయించాలి. ఈ నిబంధనను ఉల్లంఘిస్తే విత్తన చట్టం 2007 సెక్షన్ 11, నిబంధన 22 ప్రకారం ఆ విత్తనాన్ని జప్తు చేసి, విత్తన చట్టం 2007 సెక్షన్ 12 ప్రకారం జరిమానా విధిస్తారు.
- పత్తి పంట సాగు చేసి, నిర్ణీత కారణాల వల్ల పంట నష్టపోయిన రైతులకు జిల్లా, రాష్ట్ర స్థాయి కమిటీలు నిర్ణయించిన నష్టపరిహారం చెల్లించాలి. లేకుంటే విత్తన చట్టం 2007 సెక్షన్ 7, నిబంధన 28 ప్రకారం విత్తన లైసెన్స్ రద్దు లేదా సస్పెండ్ చేస్తారు. విత్తన చట్టం 2007 సెక్షన్ 12 ప్రకారం జరిమానా విధిస్తారు..
- విత్తన చట్టాలను ఉల్లంఘించి పలుసార్లు అవే నేరాలకు పాల్పడుతూ నకిలీ విత్తనాలు విక్రయించిన వారిపై పీడీ యాక్ట్ కింద కేసులు నమోదు చేసే అవకాశాలు ఉన్నాయి.



### రైతులు అప్రమత్తంగా ఉండాలి

నకిలీ విత్తనాల విషయంలో రైతులు అప్రమత్తంగా ఉండాలి. లూజ్ విత్తనాలను ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయవద్దు. నష్టం జరిగితే ఎవరూ బాధ్యత వహించరు. నకిలీ విత్తనాలపట్ల నిత్యం నిఘా పెడుతున్నాం. మా శాఖ అధికారులతోపాటు పోలీసు, రెవెన్యూ సహకారంతో మండల, వ్యవసాయ డివిజన్, జిల్లా స్థాయిలో టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేశాం. ఈ బృందాలు సమర్థవంతంగా పనిచేస్తున్నాయి. ఇప్పటికే అనేక చోట్ల నకిలీ విత్తనాలను పట్టుకున్నాం. క్రిమినల్ కేసులు పెట్టి పోలీసులు కొందరిని జైలుకు పంపించారు. అయినా రైతులు అప్రమత్తంగా ఉంటేనే నకిలీ బెడదను అరికట్టవచ్చు. ఒకే బ్రాండ్ విత్తనాలు కావాలని కొన్ని కంపెనీలు మాయజాలం సృష్టిస్తున్నాయి. వీరి మాటలు నమ్మవద్దు. ఏ బ్రాండ్ అయినా సస్యరక్షణ చర్యలు సకాలంలో తీసుకుంటే ఆశించిన దిగుబడి వస్తుంది.

**- బీ శ్రీనివాస్, కరీంనగర్ జిల్లా వ్యవసాయ అధికారి**



జగిత్యాల కొత్త కలెక్టర్ బీ సత్యప్రసాద్‌కు పూల మొక్క ఇస్తున్న కలెక్టర్ యాస్మిన్ బాషా



రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న సందీప్‌కుమార్ ఝా

# కొత్త కలెక్టర్లు వచ్చేశారు

- జగిత్యాలలో బీ సత్యప్రసాద్
- రాజన్నసిరిసిల్లలో సందీప్‌కుమార్
- పెద్దపల్లిలో కోయ శ్రీహర్ష బాధ్యతలు

**కొత్త కలెక్టర్లు వచ్చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బదిలీల్లో భాగంగా కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోని నాలుగు జిల్లాల కలెక్టర్లు ట్రాన్స్‌ఫర్ కాగా, వారి స్థానంలో కొత్తవారిని నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆదివారం రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌గా సందీప్‌కుమార్ ఝా, జగిత్యాల కలెక్టర్‌గా బీ సత్యప్రసాద్, పెద్దపల్లి కలెక్టర్‌గా కోయ శ్రీహర్ష ఆయా జిల్లాల కలెక్టరేట్ల కార్యాలయాల్లో బాధ్యతలు స్వీకరించారు.**

**- రాజన్న సిరిసిల్ల, జూన్ 16 (నమస్తే తెలంగాణ)**



పెద్దపల్లి కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కోయ శ్రీహర్ష

- జగిత్యాల జిల్లా నూతన కలెక్టర్‌గా బీ సత్యప్రసాద్ ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన్ను వివిధ శాఖల అధికారులు, సిబ్బంది కలిసి పూల మొక్కలను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవిన్యూ) పీ రాంబాబు, రెవిన్యూ డివిజనల్ అధికారులు పీ మధుసూదన్, ఆనంద్ కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు ఉన్నారు.
- రాజన్న సిరిసిల్ల జిల్లా నూతన కలెక్టర్‌గా సందీప్‌కుమార్ ఝా ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ముందుగా వేములవాడ రాజన్నను దర్శించుకున్న అనంతరం సిరిసిల్ల సమీకృత కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఆయనకు అదనపు కలెక్టర్లు గౌతమీ పూజారీ, ఖీమ్యా నాయక్ ఘనస్వాగతం పలికారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీపీవో బుచ్చయ్య, డీఆర్‌డీఓ శేషాద్రి, వ్యవసాయ శాఖ అధికారి భాస్కర్ వివిధ శాఖల అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు.
- పెద్దపల్లి జిల్లా నూతన కలెక్టర్‌గా కోయ శ్రీహర్ష ఆదివారం ఉదయం తన బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటిదాకా నారాయణపేట జిల్లా కలెక్టర్‌గా పనిచేసిన ఆయన పెద్దపల్లికి బదిలీపై వచ్చారు. కాగా, సమీకృత కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్లో బాధ్యతలు స్వీకరించిన ఆయన్ను ఆర్డీవో గంగయ్య, కలెక్టరేట్ ఏవో శ్రీనివాస్, పెద్దపల్లి తహసీల్దార్, కలెక్టరేట్ వివిధ సెక్షన్‌ల పర్యవేక్షకులు, సిబ్బంది, జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు.



మాట్లాడుతున్న రాష్ట్ర ముదిరాజ్ మహాసభ అధ్యక్షుడు, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్

# అభయ హస్తం హామీలు నెరవేర్చాలి

**ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు, మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్**

వేములవాడ, జూన్ 16 : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు అభయ హస్తంలో ఇచ్చిన హామీలో భాగంగా ముదిరాజ్‌లకు చెరువులు, కుంటలు, గుట్టలపై హక్కులు కల్పించాలని ముదిరాజ్ రాష్ట్ర మహాసభ అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ కోరారు. ఆదివారం వేములవాడ పట్టణంలో ముదిరాజ్‌లు నిర్వహించిన సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఈ నెల చివరి వారం నుంచి రాష్ట్రంలోని అన్ని మండలాల్లోని తహసీల్దార్ కార్యాలయాల్లో వినతిపత్రం అందజేయాలని ముదిరాజ్‌లకు సూచించినట్లు చెప్పారు.

### నిత్యాన్నదాన సత్రం నిర్మిస్తాం

రాష్ట్రంలోనే అతి పెద్ద పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజన్న సన్నిధిలో ముదిరాజ్‌ల కోసం నిత్యాన్నదాన సత్రాన్ని నిర్మిస్తామని బండ ప్రకాశ్ తెలిపారు. వేములవాడలో ఇప్పటికే అనేక కుల సంఘాల నిత్యాన్నదాన సత్రాలున్నాయని, తాము కూడా 150 గదులతో సత్రం నిర్మించేందుకు కమిటీని వేసుకున్నామని తెలిపారు. స్థలాన్ని సమకూర్చుకుని రాజన్న సన్నిధికి వచ్చే కుల బాంధవులకు సేవలందించేందుకు కార్యచరణ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఈ కార్యాక్రమం లో రాష్ట్ర ముదిరాజ్ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు పండుగ బాలు, జిల్లా అధ్యక్షుడు కోడి అంతయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు సత్తయ్య, వెంకట్, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు లాల లక్ష్మీరాజం, పిల్లి మధు, నాయకులు శ్రీనివాస్, దేవేందర్, మారుతి, మోహన్, రాజు, రాములు పాల్గొన్నారు.

# ఇక నుంచి 'విద్యుత్ ప్రజావాణి'

ముకరంపుర, జూన్ 16 : విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు ఇక నుంచి ప్రతి సోమవారం 'విద్యుత్ ప్రజావాణి' కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్కిల్, డివిజన్‌తోపాటు ఈఆర్వో, సబ్ డివిజన్, సెక్షన్ ఆఫీసుల్లో విద్యుత్ ప్రజావాణి నిర్వహణకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు, అదే రోజు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సర్కిల్ కార్యాలయంలో వినియోగదారులు తమ సమస్యలపై ఫిర్యాదులు సమర్పించవచ్చని సూచించారు. ఎన్పీడీసీఎల్ పోర్టల్, కన్స్యూమర్ రిసెప్షన్ డెస్క్‌లకు అనుసంధానిస్తూ 'విద్యుత్ ప్రజావాణి' పేరుతో మరొక పోర్టల్‌ను ఏర్పాటు చేశారని, ఉద్యోగులు అందుబాటులో ఉంటారని తెలిపారు.

# పిడుగులతో జాగ్రత్త

- వానకాలంలో పొంచి ఉన్న ముప్పు
- నిర్లక్ష్యం చేస్తే ప్రాణాలకే ప్రమాదం
- అప్రమత్తంగా ఉంటేనే రక్షణ



హుజూరాబాద్ రూరల్, జూన్ 16 : వానకాలం ప్రారంభమైంది. ఈ క్రమంలో ఈదురుగాలులు, ఉరుములు, మెరుపులతో పాటు పిడుగులు పడడం పరిపాటి. దీనివల్ల ఒక్కోసారి ఇండ్లల్లో విద్యుత్ ఉపకరణాలు దెబ్బతినడంతోపాటు ప్రాణనష్టం కూడా సంభవిస్తుంటుంది. అయితే, వర్షం కురిసే సమయంలో అప్రమత్తంగా ఉంటే పిడుగు పాటు నుంచి రక్షించుకునే అవకాశం ఉంది.

### పాటించాల్సిన జాగ్రత్తలు

- భారీ వర్షాలు కురిసే సమయంలో ఇంట్లో నుంచి బయటికి వెళ్లకూడదు.
- ఒక వేళ బయటికి వెళ్లిన తర్వాత వర్షం ప్రారంభమైతే ఆరుబయట ఉండకుండా అందు బాటులో ఉన్న ఏదైనా భవనంలో నిరీక్షించాలి.
- వర్షం వచ్చేటప్పుడు ఎట్టిపరిస్థితుల్లోనూ చెట్ల కింద నిలబడకూడదు. ముఖ్యంగా ఎత్తయిన చెట్ల కింద అస్సలు ఉండొద్దు. వాటికి పిడుగు ముప్పు మరింత ఎక్కువని గమనించాలి.
- ఇంటి ఆవరణలో భూమిలోపల ఉప్పు, కర్ర బొగ్గు, రాగి వైరుతో ఎర్త్ ఏర్పాటు చేయించడం ద్వారా ప్రమాదాలను అరికట్టే అవకాశం ఉంటుంది.
- మెరుపులు, పిడుగుల వల్ల విద్యుత్ ఉపకర ణాలు కాలిపోయే ప్రమాదం ఉంటుంది. ఆ సమయంలో ఇంట్లో టీవీ, ఫ్రిడ్జ్, తదితర విద్యుత్ గృహోపకరణల ప్లగ్స్ స్విచ్ బోర్డు నుంచి తీసివేయాలి.
- పిడుగులు తాటి చెట్లు, విద్యుత్ స్తంభాల మీద ఎక్కువగా పడుతుంటాయి. కాబట్టి వర్షం పడుతున్న సమయంలో విద్యుత్ తీగల కింద, ట్రాన్స్ ఫార్మర్ సమీపంలో ఉండకూడదు.
- ఒక్కోసారి పిడుగు పడ్డ ప్రదేశంలోనే మరోసారి పడే అవకాశం ఉంటుంది. కాబట్టి ఆ ప్రాంతానికి వెళ్లకూడదు.
- వర్ష సూచన ఉన్నప్పుడు గొడుగులపై ఇనుప బోర్డులు, కెమెరాలు, సెల్‌ఫోన్లు దగ్గర ఉంచుకోక పోవడం చాలా మంచిది.
- పశువులను గుడిసెలు, కొట్టాలు, షెడ్లలో కట్టివేయాలి. చెట్ల కింద ఉంచొద్దు.
- ఉరుములు, మెరుపులతో వర్షం పడినప్పుడు రైతులు పొలాల వద్ద ఉండకూడదు.



తిమ్మాపూర్ మండలం మన్నెంపల్లి శివారులో తాటి చెట్టుపై పడ్డ పిడుగు (ఫైల్)

- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం

మరియు

- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ
మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..



ప్రకటనల విభాగం...
సెల్: 9182 777 571